క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దుర్గారావు బాబ్జి తదితరులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో నారీ మణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 225 మంది పేదలకు దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది పేదలకు తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చెన్నూరు దుర్గారావు బాబ్జి, లక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

టెక్కలి: స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని వివిధ స్థాయిల్లో ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా కళాశాల విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలని కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు కోరారు. అలాగే విద్యార్థుల నైపుణ్యత కోసం తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అల్యూమినీ కో–ఆర్డినేటర్ డి.యుగంధర్, ప్లేస్‌మెంట్ అధికారి ఎం.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

జీఎస్టీవోగా పురుషోత్తం నాయుడు



పురుషోత్తంనాయుడుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస సర్కిల్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఆఫీసర్ (జీఎస్టీవో)గా ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు బాధ్యతలు శనివారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా ఉద్యోగిగా చేరి, మరలా ఇక్కడ జీఎస్టీవోగా పదోన్నతి పొంది రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు బడియ కామరాజు, రాయి కామరాజు, రాయి వేణుగోపాల్, టి.పరమేశ్వరరావు, బి.శ్రీనివాసరావు కేశవరావు, పలాస ఎన్జీవో అధ్యక్షుడు బోనెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే విరాళం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రానికి తెలంగాణ రాష్ట్రం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కె.వివేకానంద రూ.5 లక్షల విరాళాన్ని అందజేసినట్లు విజ్ఞాన కేంద్రం కమిటీ అధ్యక్షుడు పాతిన కృష్ణమూర్తి తెలియజేశారు. శనివారం హైదరాబాద్‌లో రూ.5 లక్షల చెక్కును విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: ప్రస్తుత టెక్నాలజీ యుగంలో సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని తొలుసూరుపల్లి గ్రామంలో సంకల్పం అనే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

టెక్కలి: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ సూచించారు. శనివారం కళాశాలలో గణిత శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో రామానుజన్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్థానిక అమ్మఒడి పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు.

పోరాట యోధుడు జగన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాట యోధుడని, అతనికి జనం గుండెల్లో ఎల్లప్పుడూ ప్రత్యేకమైన స్థానం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో జగన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, వృద్ధులు, పేదలకు అండగా నిలిచారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



వజ్రపుకొత్తూరు: పీఎంపురంలో జగన్ జన్మదిన వేడుకలు



వజ్రపుకొత్తూరు: కొండవూరులో...



సోంపేట: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు



కవిటి: కొత్తపుట్టుగలో వస్త్రదానం



టెక్కలి: చల్లపేట గ్రామంలో...



టెక్కలిలో పూజలు నిర్వహిస్తున్న సమన్వయకర్త పేరాడ తిలక్



కాశీబుగ్గ: కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: పలాస మండలం అల్లుకోలలో..



కంచిలిలో జగన్ జన్మదిన వేడుకలు



కంచిలి: వానప్రస్థాశ్రమంలో అనాథలకు భోజనాలు పెడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



పలాస: టెక్కలిపట్నంలో...



కవిటి: పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: పైలాన్ వద్ద కేక్ కట్ చేస్తున్న పిరియా విజయ, నర్తు రామారావు తదితరులు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. మండలంలోని తేలినీలాపురం పంచాయతీలో ధాన్యం కుప్పలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోతలు కోసిన వెంటనే ధాన్యం కొనుగోలు చేయకుండా తాత్సారం చేశారని, దీంతో కల్లాల్లో ధాన్యం నిల్వ ఉండిపోయి వర్షాలతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. కొనుగోళ్లపై రైతులు పడుతున్న ఇబ్బందులను గతంలో కలెక్టర్‌కు విన్నవించినా అధికార యంత్రాంగం పట్టించుకోలేదని మండిపడ్డారు. రైతులకు కనీసం టార్పాలిన్లు కూడా ఇచ్చుకోలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఎటువంటి కొర్రీలు లేకుండా తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.రమేష్, సర్పంచ్ పి.లక్ష్మి, నాయకులు శిగిలిపల్లి మోహన్, ఆర్.ఆంజనేయులు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



కల్లాల్లో ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

వాడివేడిగా సర్వసభ్య సమావేశం

కంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. ఈ సందర్భంగా వరి కుప్పలు తడవకుండా ఉండేందుకు రైతులకు అవసరమైన ప్లాస్టిక్ పరదాలను ప్రభుత్వం సరఫరా చేసిందని, వాటి సరఫరా సమాచారం కనీసం ప్రజాప్రతినిధులకు తెలియజేయకపోవడంతో ఎంపీపీ దేవదాస్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. రేషన్ డీలర్లకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మండలంలో ఏడుగురు డీలర్లను ఎలా తొలగిస్తారన్నారు. అదేవిధంగా బెల్లుపడ డీలర్ అక్రమాలకు పాల్పడుతుందని రుజువవ్వడంతో, అక్కడ ప్రత్యామ్నాయంగా ఎస్‌హెచ్‌జీకి బాధ్యతలు అప్పగించినప్పటికీ, మరలా పాత డీలర్‌కే బాధ్యతలు ఎలా అప్పగించారన్నారు. అయితే సీఎస్‌డీటీ ప్రస్తుతం శబరిమలకు వెళ్లారని, అతను వచ్చాక సమాచారం ఇస్తానని తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. మినీ గోకులం షెడ్స్‌కు సంబంధించి సర్పంచ్‌ల సంతకాలు లేకుండా ఎలా మంజూరు చేశారని మఠం సరియాపల్లి సర్పంచ్ కొణపల సురేష్, పురుషోత్తపురం నుంచి పైల మోహనరావులు ధ్వజమెత్తారు. అయితే ఆగస్టు 23వ తేదీన పెట్టిన గ్రామసభల ఆధారంగానే తీర్మానాలతో దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని పశువైద్యశాఖాధికారి టి.శిరీష, ఉపాధి హామీ ఏపీవో ధనుంజయలు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయశాఖ ఉద్యోగిని ప్రశ్నిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కొనుగోలుదారులకు అవగాహన అవసరం

కాశీబుగ్గ: కొనుగోలుదారులకు హక్కులపై అవగాహన అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల చైతన్య సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలాస తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ వినియోగదారుల బాధ్యతల గురించి, వస్తువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘాల సమైక్య అధ్యక్షుడు డి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం–2019 వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఏకరూప దుస్తుల్లో చిన్నారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 17వ వార్డు రోటరీనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో శనివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఫాదర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో చిన్నారులు ఏకరూప దుస్తులతో అందరినీ అలరించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సర్వే విజయవంతం చేయండి

వజ్రపుకొత్తూరు: ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారు ప్రస్తుతం చేపడుతున్న డిమాండ్ సర్వేను విజయవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సొంత స్థలం కలిగిన వ్యక్తులు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయినవారు సైతం వచ్చే ఏడాది మార్చిలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అపరాలపై ఆందోళన వద్దు



అపరాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

టెక్కలి: ప్రస్తుతం అకాల వర్షాలతో అపరాల పంటలు వేసుకున్న రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ ఏడీ బీవీ తిరుమలరావు సూచించారు. కోటబొమ్మాళి మండలంలోని పలు గ్రామాల్లో అపరాల పంటలు, పంట పొలాల్లో వరి కుప్పలను వ్యవసాయశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరద నీటి వలన అపరాలకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త చిట్టిబాబు, కేవీకే కో–ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, ఏవోలు గోవిందరావు, అప్పారావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇచ్ఛాపురం రూరల్: వర్షాలకు నేలకొరిగిన, కోత కోసిన పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడు కె.జగన్మోహనరావు అన్నారు. శనివారం ఆయన మండల వ్యవసాయాధికారి టి.భార్గవితో కలిసి మండలంలోని ముంపు ప్రాంతాలను పరిశీలించారు. వర్షానికి తడిసిన ధాన్యం మొలకెత్తకుండా ఉండటానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలని, పొలంలో నీరు నిలిచిన ప్రాంతాల్లో పనలను గట్లుపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలని సూచించారు. కల్లాల్లో ధాన్యం తడిసినట్లెతై ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు మరియు 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించకోవచ్చన్నారు.



నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న ఏడీ జగన్మోహనరావు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సోంపేట: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ బి.మంగరాజు అన్నారు. మండలంలోని కొర్లాం గ్రామంలో గ్రామస్తులు, యువతతో సంకల్పం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగే తీరును వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. బారువ ఎస్‌ఐ హరిబాబు నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ మంగరాజు

అయ్యో.. అన్నదాత

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వస్తుందన్న సంతోషం అన్నదాతల్లో ఆవిరైంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట నీట మునిగింది. దీంతో రైతుల లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేట వద్ద వర్షానికి తడిసిపోయిన వరి కుప్పను తొలగిస్తున్న రైతులు



సోంపేటలో వర్షపు నీటిలో ఉన్న వరిచేను



టెక్కలి: తలగాంలో ధాన్యం కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్న రైతులు



సోంపేట: వరికుప్పలు వద్ద ఉన్న నీటిని బయటకు తరలిస్తున్న రైతు

సేద్యంపై చిన్నచూపు..!

- నిరుపయోగంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- వ్యవసాయ పరీక్షలు నిర్వహించని వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం



టెక్కలిలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ (ఫైల్)

టెక్కలి: రైతులు, మత్స్యకారులు, పాడి రైతులకు సంబంధించి వ్యవసాయం, చేపల పెంపకాలు, పశు పోషణపై వివిధ రకాల పరీక్షలు నిర్వహించేందుకు గత ప్రభుత్వం టెక్కలి నియోజకవర్గ కేంద్రంలో సుమారు రూ.84 లక్షల వ్యయంతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు రూపకల్పన చేసింది. అయితే గత ప్రభుత్వంలో ల్యాబ్‌కు వివిధ రకాల పరికరాలను అందజేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ల్యాబ్‌కు పూర్తిస్థాయిలో పరికరాలు సరఫరా చేసే విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, పురుగు మందుల కల్తీలపై ఎటువంటి నాణ్యత పరీక్షలు చేపట్టలేకపోయారు. దీంతో టెక్కలి నియోజకవర్గంలో సుమారు 84,045 ఎకరాలకు సంబంధించి సుమారు 55,256 మంది రైతులు అగ్రి టెస్టింగ్ సేవలు అందుకోలేకపోయారు. ఫలితంగా ఈ ఏడాది ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత గుర్తించలేకపోయారు.

పరీక్షలు చేయలేదు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పరీక్షలు చేయలేదు. ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసుకున్నాం. అయితే అవి ఎలా ఉన్నాయో మాకు తెలియని పరిస్థితి నెలకొంది. తక్షణమే అగ్రి టెస్టింగ్ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి. – బి.ధనుంజయరావు, రైతు, పోలవరం, టెక్కలి మండలం

త్వరలోనే పరీక్షలు



ఈ ప్రభుత్వంలో వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీనిలో భాగంగా టెక్కలిలో నియోజకవర్గ రైతులకు అందుబాటులో ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పూర్తి స్థాయిలో పరికరాలు అందజేయడానికి చర్యలు చేపడుతున్నారు. మరి కొద్ది రోజుల్లో సేవలు అందుబాటులోకి వస్తాయి.

–బి.వి.తిరుమలరావు, వ్యవసాయ శాఖ ఏడీ, టెక్కలి

ఏడుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: మండలంలోని చినబాడం గ్రామానికి చెందిన బడ్డ నాగరాజుపై హత్యాయత్నానికి వ్యూహం రచించిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలియజేశారు. కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో వివరాలు శనివారం వెల్లడించారు. గ్రామంలో ఆధిపత్యం ధోరణే హత్యకు ప్రణాళిక వరకు దారి తీసిందని పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన అంపోలు శ్రీనివాసరావు, కూర్మాపు ధర్మారావు, కోట శ్రీనివాసరావులతో పాటు మరొకరు కలిసి సాక్ష్యాధారాలు లేకుండా నాగరాజును అంతమొందించాలని ప్రణాళిక వేశారని ఎస్పీ తెలిపారు. దీనికోసం తెలిసిన వ్యక్తులతో బీహార్ సుపారీ గ్యాంగ్‌ను సంప్రదించి రూ.10 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారని చెప్పారు. రూ.2 లక్షలు అడ్వాన్సు సైతం ఇచ్చారన్నారు. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఒకకారు, 3 ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు, 2 గన్లు, 1 తపంచా, 41 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసులో సంబంధం ఉన్న మరి కొంతమంది దొరకాల్సి ఉందని.. త్వరలో పట్టుకుంటామని ఎస్పీ మహేశ్వరరెడ్డి వివరించారు.